70 వేల టెక్ ఉద్యోగాల కోత

ఈ తొలగింపులన్నీ గత నాలుగు నెలల్లోనే..
గూగుల్, అమెజాన్, యాపిల్, టెస్లాల్లో భారీగా ఫైరింగ్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా దిగ్గజ టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతల పర్వం కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు టెక్ రంగంలో ఉద్యోగాల కోల్పోయిన వారి సంఖ్య 70 వేలు దాటింది. ఉద్యోగులను తీసేసిన సంస్థల జాబితాలో టెక్ దిగ్గజాలైన గూగుల్, అమెజాన్, యాపిల్, ఇంటెల్, టెస్లా వంటి సంస్థలు ఉన్నాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ టెస్లా పలు విభాగాల్లోని వేలాది మంది ఉద్యోగులపై వేటు వేసింది. అమ్మకాలు తగ్గిన నేపథ్యంలో ఖర్చులను అదుపులో ఉంచుకోనేందుకు ప్రపంచవ్యాప్తంగా 10 శాతం ఉద్యోగులను తొలగించాలన్న లక్ష్యంలో భాగంగా ఈ చర్య చేపట్టిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. యాపిల్‌లో స్పెషల్ ప్రాజెక్టు గ్రూపులోని 614 మంది ఫైర్ అయ్యారు. వీరిలో కొంత మంది ప్రస్తుతం రద్దయిన సెల్ఫ్-డ్రైవింగ్ కారు ప్రాజెక్టుకు చెందిన వారు. పైథాన్, ఫ్లుట్టర్, డార్ట్‌లపై పనిచేసే బృందాల్లోని చాలా మంది ఉద్యోగులను గూగుల్ కంపెనీ తొలగించింది. వారికి కంపెనీలోనే ఇతర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ డివిజన్‌లో అమెజాన్ వందలాది మందిని తొలగించింది. ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్ దాదాపు 500 మందిపై వేటు వేసింది. ఇంకా ఇంటెల్, ఓలా క్యాబ్స్, హెల్తిఫై, టెలినార్ వంటి సంస్థలు గణనీయ సంఖ్యలో ఉద్యోగాలు తొలగింపు చేపట్టాయి.

40 శాతం తగ్గిన హెచ్-1బీ లాటరీ దరఖాస్తులు

అమెరికా హెచ్-1బీ వీసా లాటరీ కోసం ఈ ఏడాది దాదాపు 40 శాతం తక్కువ దరఖాస్తులు వచ్చాయని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది. 2023 లో 7,58,994 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది 4,79,342 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలిపింది. కాగా, దరఖాస్తు ఇంతకుముందు హెచ్-1బీ లాటరీ కోసం మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకునే పద్ధతి ఉండేది. తర్వాత ఎలక్ట్రానిక్ పద్ధతిని ప్రవేశపెట్టారు. అయితే, కొన్ని కంపెనీలు, వ్యక్తులు ఈ పద్ధతిని దుర్వినియోగం చేసి డుప్లికేట్ దరఖాస్తులు చేస్తున్నారని యూఎస్‌సీఐఎస్ గుర్తించింది. దీంతో ఈసారి ఒక్కరు ఒకే దరఖాస్తు చేసే విధానాన్ని అమలు చేసింది. దీంతో దరఖాస్తులు భారీగా తగ్గినట్టు భావిస్తున్నారు.

అయోధ్య రాముని సన్నిధిలో రాష్ట్రపతి

అయోధ్య, మే 1: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా అయోధ్య రామాలయాన్ని బుధవారం దర్శించుకుని హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజారులు, పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆమె రాముని విగ్రహం ముందు మోకరిల్లి నమస్కరిస్తున్న వీడియోను రాష్ట్రపతి అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో షేర్ చేశారు. అయోధ్య ఆలయ దర్శనానికి ముందు ఆమె సరయు నదికి హారతి కార్యక్రమంలో పూలదండలు సమర్పించారు. అలాగే హనుమాన్ గర్హిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అయోధ్య ఎయిర్‌పోర్టులో ఆమెకు యూపీ గవర్నర్ ఆనంద్‌బెన్ పటేల్ స్వాగతం పలికారు.

హ్యారీపోటర్ కోటపై రష్యా దాడి

ఐదుగురు మృతి.. 32 మందికి గాయాలు

కీవ్, మే 1: ఉక్రెయిన్‌లో హ్యారీపోటర్ కోటపై రష్యా క్షిపణి దాడిచేసింది. పోర్టు సిటీగా పేరొందిన ఒడెస్సాలోని ఈ అందమైన కోట వాస్తవానికి ఒక విద్యా సంస్థ అయినప్పటికీ దానిని హ్యారీపోటర్ కోటగా వ్యవహరిస్తారు. స్కాటిష్ నిర్మాణ శైలిలో ఉన్న ఈ భవనం లక్ష్యంగా రష్యా జరిపిన ఈ దాడిలో ఐదుగురు మృతి చెందగా, 32 మంది గాయపడినట్టు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. వీరిలో ఇద్దరు చిన్నారులు, ఒక గర్భిణీ ఉన్నారు. ఈ దాడితో చుట్టుపక్కల 20 నివాస భవనాలు దెబ్బతిన్నాయి. హ్యారీపోటర్ కోటలో మంటలు ఎగసిపడుతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఇస్కందర్-ఎం-బాలిస్టిక్ క్షిపణిపై క్లస్టర్ వార్‌హెడ్ అమర్చి ఈ దాడి జరిపినట్టు ఉక్రెయిన్ నేవీ అధికారి ఒకరు తెలిపారు. క్షిపణి దాడితో శకలాలు దాదాపు 1.5 కిలోమీటర్ల దూరం వరకు పడినట్టు ఆయన చెప్పారు. పౌరులను హతమార్చడానికే రష్యా ఈ ఆయుధాన్ని ప్రయోగించినట్టు అధికారులు ఆరోపించారు.

మరో రెండు నానో టెక్ ఎరువులకు అనుమతి

న్యూఢిల్లీ: పంటల్లో జింక్, కాపర్ లోటును సర్దుబాటు చేసి, ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడే మరో రెండు నానో టెక్ ఎరువులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఇఫ్కో బుధవారం తెలిపింది. ఇఫ్కో అభివృద్ధి చేస్తున్న నానో టెక్నాలజీ ఆధారిత నూతన ఎరువులు వ్యవసాయ రంగంలో గుర్తింపు పొందుతున్నాయని ఆ సంస్థ ఎండీ యూఎస్ అవస్థి ట్వీట్ చేశారు. తాజాగా నానో జింక్ (లిక్విడ్), నానో కాపర్ (లిక్విడ్)ను భారత ప్రభుత్వం మూడేళ్ల కాలానికి నోటిఫై చేసిందని తెలిపారు. ఈ రెండిటినీ ఇఫ్కో కొత్తగా అభివృద్ధిపరచినట్లు తెలిపారు. వీటికి ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ఆమోదం లభించినట్లు చెప్పారు. అయితే ఈ రెండూ మార్కెట్లో ఎప్పటి నుంచి అందుబాటులో ఉంటాయో వెల్లడించలేదు.

సల్మాన్ ఇంటిపై కాల్పుల కేసు నిందితుడి ఆత్మహత్య

ముంబై, మే 1: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటిపై కాల్పులు జరిపిన కేసులో నిందితుడు లాకప్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు హుటాహుటిన దవాఖానకు తరలించగా మార్గమధ్యంలోనే చనిపోయినట్టు అధికారులు తెలిపారు. నిందితుడు అనుజ్ థపన్ (23) లాకప్‌లోని టాయిలెట్‌లో బెడ్‌షీట్‌తో బుధవారం ఉరేసుకున్నాడు. పోలీసులు అతడిని సమీప ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దక్షిణ ముంబైలోని మైదాన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. ముంబైలోని సల్మాన్ ఇంటిపైకి కాల్పులు జరిపిన విక్కీగుప్తా, సాగర్‌పాల్‌కు ఆయుధాలు సరఫరా చేసిన ఆరోపణలపై పంజాబ్‌లో సోనుకుమార్ బిష్ణోయ్‌తో పాటు అనుజ్ థపన్‌ను అరెస్టు చేశారు.

చైనాలో కూలిన హైవే.. 24 మంది మృతి

బీజింగ్: కార్మిక దినోత్సవంనాడు చైనాలో విషాదకర సంఘటన జరిగింది. గ్వాంగ్‌డాంగ్, నార్తర్న్ మెయిరుూ సిటీ, డబు కౌంటీలో బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఓ హైవే కూలిపోవడంతో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్వత ప్రాంతంలో ఉన్న ఈ హైవే శిథిలాల క్రింద సుమారు 20 వాహనాలు, 54 మంది ప్రయాణికులు చిక్కుకున్నారు. కార్మిక దినోత్సవాల సందర్భంగా ఐదు రోజులపాటు సెలవులు కావడంతో హైవేలపై టోల్ ఫ్రీగా ప్రయాణం చేయవచ్చు. దీంతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉండే సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

హిందూ వివాహం అంటే ఆటపాటలు కాదు

- ఏడడుగులు నడవాల్సిందే
- ఆ వివాహానికే చట్టబద్ధత
- స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, మే 1: 'హిందూ వివాహం అంటే ఆటపాటలు కాదు.. విందు భోజనాలు అసలే కాదు.. అదొక పవిత్ర మతపరమైన ప్రక్రియ' అని సుప్రీం కోర్టు తెలిపింది. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం హిందూ వివాహ ప్రాముఖ్యత, చట్టబద్ధతను వివరించింది. హిందూ వివాహం అనేది సప్తపది (అగ్ని చుట్టూ ఏడు అడుగులు నడిచే ప్రక్రియ)తో ముడిపడి ఉంటుందని స్పష్టం చేసింది. 'హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం హిందూ వివాహాన్ని నమోదు చేయడం వల్ల వివాహానికి రుజువు లభిస్తుంది. కానీ, చట్టంలోని సెక్షన్ 7 ప్రకారమే వివాహం జరగాలి. అంటే వివాహ వేడుకలో సప్తపది నిర్వహించాలి. అలాకాకుంటే ఆ వివాహానికి చట్టబద్ధత లభించదు. హిందూ పెండ్లి ఒక సంస్కారమైన మతకర్మ. ఇది భారతీయ సమాజంలో గొప్ప విలువ కలిగిన సంస్థ. అది దాని హోదాను పొందవలసి ఉంటుంది. అత్యంత వైభవోపేతంగా పెండ్లి నిర్వహించినా, చట్టం దృష్టిలో నిబంధనలే ప్రామాణికం. పరస్పర గౌరవం, భార్యాభర్తల మధ్య బంధం హిందూ వివాహ పవిత్ర లక్షణం. అందుకే ఆ వేడుక సముచిత మర్యాదలతో నిర్వహించాలి. పెండ్లి చేసుకొనే వధువు, వరుడు వివాహ వ్యవస్థలోకి ప్రవేశించే ముందు దాని గురించి లోతుగా ఆలోచించాలి' అని ధర్మాసనం వెల్లడించింది. భారతీయ సమాజంలో పెండ్లి అనేది పాటలు, డ్యాన్స్, విందు కోసమో, కట్నాలు, కానుకల కోసమో చేసే తంతు కాదని తేల్చిచెప్పింది. ముఖ్యంగా వివాహం అనేది వాణిజ్యపరమైన లావాదేవీ కాదని, ఒక గంభీరమైన కుటుంబ వ్యవస్థకు పునాది అని తెలిపింది. భవిష్యత్తులో కుటుంబంగా మారే భార్యాభర్తల హోదాను పొందే స్త్రీ, పురుషుల మధ్య సంబంధాన్ని హిందూ వివాహం ఏర్పరుస్తుందని పేర్కొన్నది.

ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 150కి పైగా పాఠశాలలకు బుధవారం ఈమెయిల్స్‌లో బాంబు బెదిరింపులు వచ్చాయి. నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్ ప్రాంతాల్లోని ప్రైవేట్ స్కూళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టి, నకిలీ బాంబు బెదిరింపులుగా తేల్చటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బాంబు బెదిరింపు ఈమెయిల్స్ ఎక్కడ్నుంచి పంపారన్నది గుర్తించామని, దీని వెనుకున్న కుట్రదారులను కఠినంగా శిక్షిస్తామని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సెనా చెప్పారు. ఈ బాంబు బెదిరింపులతో నగరంలో పిల్లల తల్లిదండ్రులంతా పాఠశాలలకు పరుగులు తీశారు. అప్రమత్తమైన స్కూల్ యాజమాన్యాలు పోలీసులకు సమాచారాన్ని ఇచ్చాయి. వెంటనే రంగంలోకి దిగిన బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు జరిపాయి. బాంబు బెదిరింపు ఈమెయిల్స్ ఒకే చోట నుంచి వచ్చాయని, ఐపీ అడ్రస్‌ను బట్టి రష్యా నుంచి ఓ వ్యక్తి ఈ బెదిరింపు మెయిల్స్ పంపినట్టు అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు.

లగ్జరీ లైఫ్ వదిలి.. సన్యాసం స్వీకరించి

సూరత్, మే 1: భవబంధాలను త్యజించి, సర్వసుఖాలను వదులుకుని సన్యాసిగా మారి భిక్ష పాత్రతో జీవించడం ఎంత కష్టమైన పనో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బెంగళూరుకు చెందిన ఓ జైన వ్యాపారవేత్త భార్య, తన 11 సంవత్సరాల కుమారుడితో కలిసి సన్యాసం స్వీకరించేందుకు సర్వాన్నీ త్యాగం చేశారు. నిజానికి జైన మతంలో సన్యాసి జీవితాన్ని ఎంచుకోవడం అత్యంత గౌరవప్రదమైన నిర్ణయం. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా ఎంతోమంది ఇలా సర్వసుఖాలను తృణప్రాయంగా వదులుకుని సన్యాస జీవితంలోకి మారిపోయారు. తాజా విషయానికి వస్తే ఆమె పేరు స్వీటీ. వయసు 30 ఏళ్లు. తన 11 ఏళ్ల కుమారుడు హృదన్‌తో కలిసి సన్యాసం స్వీకరించారు.

పదకొండేండ్లకే గౌరవ డాక్టరేట్

కలశనాయుడుకు అరుదైన గౌరవం

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): తెలుగుతేజం చిన్నారి కలశనాయుడు అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. పదకొండేండ్లకే గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైంది. కలశ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన యూనైటెడ్ నేషన్స్ గ్లోబల్ పీస్ కౌన్సిల్ ఇటీవలే గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, సమాజ సేవ కురాలిగా కలశ గుర్తింపు తెచ్చుకుంది. అక్షర కలశ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు, మహిళలకు అవార్డులివ్వడంతో పాటు గ్రీన్‌రన్లను నిర్వహించింది. గతంలో కలశ బ్రిటీష్ పార్లమెంట్‌నుద్దేశించి రెండు నిమిషాలు ప్రసంగించింది.

10 లక్షల మందిలో ఏడుగురికే సైడ్ ఎఫెక్ట్స్

కొవిషీల్డ్‌పై ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త రామన్

న్యూఢిల్లీ, మే 1: కొవిషీల్డ్ వ్యాక్సిన్ దుష్ప్రభావాలపై తయారీ సంస్థ ఆస్ట్రాజెనికా చేసిన ప్రకటన ఆ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో భయాందోళనలు రేపుతున్నది.అయితే ప్రజల అనుమానాలను వైద్య నిపుణులు కొట్టిపారేస్తున్నారు. వ్యాక్సిన్ తీసుకొన్న వారు భయపడాల్సిన అవసరం లేదని, అంటువ్యాధులు నిపుణుడు డాక్టర్ రమాన్ గంగాఖేడ్కర్ స్పష్టం చేశారు. ప్రతి 10 లక్షల మందికి 7-8 మందిలో మాత్రమే రక్తం గడ్డకట్టే రిస్క్ ఉంటుందని, అది కూడా మొదటి డోసు తీసుకొన్న సమయంలోనే ఉంటుందని పేర్కొన్నారు. తర్వాతి డోసుల సమయానికి ఆ రిస్క్ పూర్తిగా తగ్గుతుందని, ఏమైనా దుష్ప్రభావాలు చూపిస్తే, అది మొదటి 2-3 నెలల్లోనే జరుగుతుందని చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.